# రాజేశ్వరి

- బి. పద్మజ



డిశంబరు నెల మొదటి వారం. ఉదయానికి స్వాగతం పలుకుతూ పిట్టలు అదేపనిగా అరుస్తున్నాయి. పశువుల కాపర్లు వేసేకేకలు లేగదూడలను విడిచిపోతూ అవులు అరిచే అరుపులు - అప్పుడే మేల్కొన్న పల్లె సందడిలో ఉన్నది.

కప్పుకున్న దుప్పటి పక్కన పడేసి ఉలిక్కిపడి లేచింది రాజేశ్వరి. పల్లె మర్మర ధ్వనులతోపాటు తెల్లారగట్ల చలిరాజేశ్వరి ఒంటిని జివ్వునతాకింది. అవులిస్తూ ఒళ్లు విరుచుకుంది. ఆ ఉదయపు చీకటి వెలుగు ల్లాగే పీడని, రూపొందని ఆలోచనలు ముసుకుకుంటూ, విచ్చుకుంటుండగా - కప్పుకున్న దుప్పటి, కింద పరుచుకున్న బొంత మడత వేసింది.

అప్పటికే నిద్ర లేచిన పక్కింటి లచ్చుమక్క గొనుక్కుంటూ మొండి చీపురుతో బరుకు బరుకున వాకిలి ఊడుస్తోంది.

రాజేశ్వరి తన వాకిట్లోకి వచ్చినిలు చున్నది....గుడిసె కప్పుల మీదుగా పొద్దటి వంటపొగలు బద్ధకంగా లేస్తున్నాయి. అంతకన్నా పలుచగా మంచుతెరలు విచ్చు కుంటున్నాయి. తన ఇంటిపక్క నాటిన బంతి పూల మొక్కల మీదుగా వీచిన చిరుగాలి తోపాటు కలిగాపులగపు ఊరివాసన రాజేశ్వరి ముక్కుపుటాలకు సోకింది. వెలుగు చీకట్లు కలిసిన సుదూర దిగంతంలో వెలుతురును పూయడానికి సూర్యుడు తంటాలు పడుతు న్నాడు.

రాజేశ్వరి నెత్తి గోర్లకొట్టుకున్నది. వీధిలో గోధూళి తెర - పశువుల డెక్కల చప్పుడు. అరికంట్లంకట్టుకున్న పిల్లొకతి పేడ తట్టతో పరుగెత్తుతున్న చిన్నారి అడుగుల చప్పుడు. రాజేశ్వరి 'నీళ్లగోళెం' దగ్గరికి నడిచింది. రాత్రే కొట్టుకొచ్చిన బోరింగు నీళ్లు చేతుల్లోకి తీసుకొంది. జివ్వుమన్నాయి చేతులు. నోరు పుక్కిలించి - బయటి చెంబుతో బయటకు పోయొచ్చింది.

సానంపు చల్లి ముగ్గేస్తున్న లచ్చుమక్క - "ఏందేరాయేశ్వరి ఇయ్యేల్ల గింత పొద్దెక్కదన్క లేవలే."

"తెల్లారగట్ల కన్నంటుకున్నదక్కా" రాజేశ్వరి.

"ఎన్నిసార్లు చెప్పిన వినిపించుకోవుగదా?" లచ్చుమక్క.

తను ఎన్నోమార్లు ఈమాటే అను కుంటుంది. కాని ప్రతిరాత్రి మనసు తన మాట వింటేకదా!

లచ్చుమక్క ఇంట్లోకి వెళ్లిపోయింది.

రాజేశ్వరి వాకిలూడ్చి కలాపి జల్లింది. ముగ్గులు పెట్టింది. రాత్రి గిన్నెలు కడిగింది. బోరింగు దగ్గరినుండినీళ్లు తెచ్చుకున్నది. పొయ్యి అంటించి నీళ్లకుండ పొయ్యిమీద పడేసింది. బొగ్గుతో పళ్లు తోముకొని ముఖం కడుక్కొన్నది. బియ్యం కడిగి పొయ్యిమీద పెట్టింది. కాగిన నీళ్లతో స్నానం చేసింది. చలిచలిగా అనిపిస్తుంటే నీరెండకు వాకిట్లో నిలుచున్నది.

లచ్చుమక్క మనుమడు 'ఓ' అంటూ రాగం తీస్తూ ఏడుస్తున్నాడు. ఇంటి పనులు పూర్తి చేసుకొని అందరికి బయటిపనులకు పోయేతొందర. ఆడవాళ్లు వంట పనులకు ఉరుకులు పరుగుల మీదున్నారు. మొగవాళ్లు ధోవతలు, అంగిల చింగులు తన్నుకుంటూ వీధుల్లో అటిటు తిరుగుతున్నారు. పిల్లలను ఎత్తుకొని ముద్దాడి ఊకుంచే తీరిక, ఓపిక ఎవరికిలేదు.

రాజేశ్వరి ఆ చిన్నపిల్లవాన్ని ఎత్తుకొని చీమిడి తీసింది. పిల్లవాడు రాజేశ్వరి ముఖంలోకి చూసి ఏడుపు ఆపాడు.

ఇంతలోనే అయిదారు ఇండ్లకావల పెద్దలొల్లి లేచింది.

"వావ్వే - నన్ను సంపుతండ్లు" అనికేక విన్పించింది.

రాజేశ్వరి గబగబ వీధిలోకి వచ్చింది. అప్పటికే చాలామంది అక్కడికి ఉరుకు తున్నారు. అయిదారిండ్లకావల అనుముల వెంకటరాజం ఇంటిముందు చాలామంది కుప్పయ్యిండ్లు - పందిరికింద వెంట్రుకలు ఊడిపోయి బట్టలు చిరిగిపోయి వెంకటరాజం భార్య కనకమ్మ వెక్కి వెక్కి ఏడుస్తున్నది.

"గీచువ్వనాతి ముండ చెప్పినట్టు నేను వింటానా? నా ఇష్టం. నాకష్టం తాగుత తలకువోసుకుంట" వెంకటరాజం రాత్రి తాగిన 'గుడుంబా' ఇంకా దిగక అక్కడికిక్కడికి ఎగురుతున్నాడు.

వారి పిల్లలిద్దరు బిక్కముఖాలతో ఏడుస్తున్నారు.

"నర్సొక్కులోనికి నకురాలెక్కువని - తాగుతదట - తాగుతడు' ' ఒక మునల వ్వకనకవ్వ దగ్గరికి ధైర్యం చేసి వెళ్లింది.

"పెద్దవ్వఈ సంసారం చెయ్యలేను - ఈ దెబ్బలు వడలేను. ఈ తాగుబోతు ముండ కొడుకని తోని ఏగిచ్చుడు నావశంగాదు." కనకవ్వ లబ్బదిబ్బ మొత్తుకున్నది.

కొందరు ఆడవాళ్లు ముక్కులు చీదారు. మరికొందరు వెంకటరాజంను తిట్టిపోశారు.

"నీయవ్వనాలికబీకుత" వెంకటరాజం కనకమ్మ మీదికి ఉరికొచ్చాడు.

ఎవరో అతన్ని పక్కకు తీసుకపోయారు.

"ఇదిఊరా! అడివా! చూసుకుంటునన్నరేందిర్ర - దాని నెత్తురు సంపాదన తాక్కుంట మీదికెళ్లి కొడుతండు."పెద్దవ్వ.

"వానింట్ల పీనిగెల్ల - వాని వాముపరుక వా ఒళ్లంత పచ్చిపుండయ్యే దనుక కొట్టిండు పెద్దవ్వ - వావల్లగాదు పెద్దవ్వా!' ' కనకవ్వ ఏడుపుమొదలేసింది.

మందిని పెలిపిచ్చుకొని వెంకటరాజం పూనకం పూనిన వానిలాగా పరుగెత్తుకొచ్చి కనకవ్వ సిగెంటికలు పట్టి గొరగొర ఈడ్చిండు. అందరు "హాహా"అన్నరు.

రాజేశ్వరి తన చేతులల్లోని పిల్లవాన్ని పక్కొవిడకిచ్చి పరుగెత్తి వెంకటరాజంను తోసేసింది. అతను పడబోయి నిలదొక్కు కున్నాడు.

"నువ్వు మనిషివా పసురానివా? ఏందుల్ల అట్ల చూత్తండ్లు - గింత మంది ముంగట కొడుతాంటే భీరిపొయ్యండ్లు. బాగా మాట్లాడు తరుగద. ఆడిదాన్ని కొట్టే హక్కు నీకెక్కడిది? అంతగనం పడకపోతే ఎవ్వల్దివాళ్లు బతుకుండ్లి - తాగుతవో! తలకువోసుకుంటవో నీయిష్టం. దానిరెక్కలకట్టం అది చేసుకబతుకు తది." రాజేశ్వరి గొంతు ఖంగున మోగింది.

వెంకటరాజం ఆరూపం, కోపం చూసి ఏమనుకున్నడో ఏమో పెద్ద పెద్ద అంగలేస్తూ వీధిలోకి నడిచాడు.

"మంచిపని చేసినవే రాయేశ్వరి" ఆడ వాళ్లు మెచ్చుకున్నారు.

రాజేశ్వరి తనకొంగుతో కనకవ్వ కన్నీళ్లు తుడిచింది. బట్టలు సదిరింది. ఏడిచే పిల్లలను సముదాయించింది.

పిల్లవాన్ని తీసుకొని తనింటికి వచ్చింది. మెదడు మొద్దుబారి పోయినట్టుగున్నది. లోపల మంట ఎగదోసి నట్టుగా - ఆమంట నుండి తట్టుకోవడానికి పిల్లవానికి స్నానం చేయించింది. అన్నం తినిపించింది. తనకేమ య్యింది? తనెందుకు నిలువజాల కున్నది. వద్దువద్దనుకుంటూనే తనెందుకు బయట పడుతుంది. వెంకటరాజం ఏమను కున్నాడు? వెంకటరాజం తనమీదికి ఎదురు తిరుగుతే తనేం చేసిది? బహుశా మీదపడి ఇయ్యర మయ్యర కొట్టేది. మల్లీ పంచాయితీ.

కనకవ్వకు తనేంచెప్పింది? చెప్పినంత సులువా ఎవలబ తుకువాళ్లు బతుకుడు? చెప్పంగనే అయిపోతదా? అట్ల బతకడానికి తానెంత తండ్లాడింది?

వద్దు తవ్వుకోవద్దు. గొంతులో ఏదో గురగురలాడుతోంది. ఏదో కరిగి కరిగి నీరుకాబోతోంది. .. తన నుండి మళ్లీ కనకమ్మ మీదికి మనుసు తిప్పజూసింది రాజేశ్వరి.

అకర్రోనికి పనిచాతకాదు. దానికి తోడు తాగుడు. ఊళ్లో వాళ్లు చాలాసార్లు చెప్పారు. ఆడవాళ్లు అనేకసార్లు తిట్టిపోశారు. మంచి గఉన్నట్టే ఉంటడు. ఇట్లనే ఎప్పుడో బయట పడుతడు.

కనకవ్వ తల్లిగారుబీదోళ్లు. కాలుసేత ఇద్దరు పోరగండ్లు - కనకవ్వను వేరుండమని తను చెప్పింది. ఊళ్లో వాళ్లుచెప్పారు. రెన్నెల్లక్రితం ఎవరిది వాళ్లే వండుక తిన్నారు. మళ్లీ కలిశారు.

ఇప్పుడు మళ్లీ తను అమాటే చెప్పింది. అట్ల బతకడం తను చెప్పినంత అలుకగనా? ఈ మనుషులు వేటినైతే సూసి మురిసిపోతరో సంసారం మొగుడు, ఇల్లు,పిల్లలు ఇవన్ని బంధాలే - కాని ఈ బంధాలు లేకుంట బతుకుడు కష్టమే. మనిషి మనిషి తీర బతుకాలంటే వీటన్నిటితోటి కొట్లాడక తప్పుతుందా? అందరు చెప్పేనీతులు వినాలి. మొగన్ని కాదని ఉంటే - మొగనితో నుంటే తన్నులు. ఇవి బయటకు కనిపిస్తాయి. బయటకు కనిపించని మరెన్నో భరించాలె.

తను. తను ఈరీతి రివాజుల నెదిరించింది. కాని ఎంత గొడువ పడాల్సి వచ్చింది. బంధాల కావల ఎంత తిరుగాల్సి వచ్చింది. ఎందుకో రాజేశ్వరికి పొగలాగా ఏదో లోలోపల మసులుతోంది. కళ్లల్లో నీళ్లూరుతున్నాయి.

కాళ్లు రెక్కలున్నోళ్లు. తమరెక్కల కష్టాన్ని నమ్ముకున్నోళ్లు ఎవరికైనా ఎందుకు బయపడాలె?

రాజేశ్వరి ఇలాంటి ఆలోచనలు తప్పించు కోవడానికి లచ్చుమక్క ఇంట్లోకి నడిచింది.

లచ్చుమక్క పెద్దబిడ్డ నర్సవ్వ పాలకోసం ఏడుస్తున్నకూతురును రెండు చరిచింది.

నోరంత పిట్టలా తెరిచి ఆ పిల్ల ఏడ్వ సాగింది.

"ఏందేనర్సా పిల్లను ఏడిపిస్తిన్నవ్? "రాజేశ్వరి.

"ఏంజేయాలనక్క ఈపోరగండ్లతోటి వశ పడుతలేదు. వాగండాన దాపురించిండ్రు. "నర్సవ్వ పిల్లను రాజేశ్వరి చేతికిచ్చింది.

"గట్లంటె ఎట్లనవ్వ - నీ పిల్లలను నువ్వు సూడకుంటె ఎవలు సూత్తరు? బతుకంటె కష్టం సుఖం అన్ని ఎల్లబొయ్యాలె" ఎముకలు తేలిన నర్సమ్మ ముఖంలోకి ,చూస్తూ రాజేశ్వరి.

"నీకేంది మొగుడా? మొద్దులా పిల్లలా జెల్లలా గట్లనే అంటవు' ' నర్సమ్మ మనుసులో-

రాజేశ్వరికి అది అర్థమౌతూనే ఉన్నది.

చిన్నపిల్ల రాజేశ్వరి ఛాతీ తడుముతోంది. మెత్తటి చేతుల స్పర్శ. రాజేశ్వరికి లోపలెక్కడో తడిమినట్టుగా ఉంది. చిన్నపిల్ల చేతులు ముద్దాడింది. వెంట్రుకలు సరిచేసింది.

నర్సవ్వ లచ్చుమక్క పెద్ద బిడ్డ మొగుడు ముగ్గురు పిల్లలు పుట్టిన తరువాత ఉన్న కాడికి అమ్మి 'మస్కట్' (గల్ఫ్‌దేశం) పైరవీలో తిరుగుతున్నాడు. ముగ్గురు పిల్లలను తీసుకొని నర్సవ్వ తల్లిగారిల్లు చేరింది. లచ్చుమక్క వాళ్లకున్నది రెండెకరాలు - దాంట్లో పండింది తిండికే సరిపోదు. పైగా పెద్దబిడ్డ అయినా లింగయ్యగాని లచ్చుమక్క విసుక్కోలేదు. ఇంటిల్లి పాది కూలికిపోతారు. నర్సక్క కాక ఇంకా నలుగురు.

ఒరగంట నర్సమ్మ కేసి చూసింది. ఇంటి సూరుకింద నర్సవ్వ సొమ్మసిల్లి కూర్చున్నది. ఇరువై ఏండ్లకే ముగ్గురు పిల్లల తల్లయ్యింది. నెత్తురుతోడేసినట్టు మనిషి తెల్లగా పాలిపోయి బక్కగ ఉన్నది. కళ్లు పీక్కపోయి గుడ్లల్ల పానంతో తిరుగుతుంటుంది.

చిన్నప్పుడు బడికి తోలలేదని - భారం దిగిపోతుందని తనకు యిష్టంలేని మేనబావ కిచ్చి చిన్నప్పుడే పెండ్లి చేసిండ్లని అయ్యవ్వల మీద ఆమెకు కోపం. అత్తగారింట్లో చాకిరి, ఒకరెనుక ఒకరు పిల్లలు పుట్టడం. రికామిగా తిరిగేభర్త అందరు కలిసి తనను పీక్కతిన్నారని ఆమెకు చెప్పరాని కోపం. తన సమస్తం ఎవరో దోచుకున్నట్లు పరాకుగా తిరుగుతుంది. జీబురు జీబురుగా ఉంటుంది.

'ఆడదాని బతుకే అంత' రాజేశ్వరి పొదుగ్గా గాలి పీల్చి తన చేతుల్లోని పిల్లను నర్సమ్మకు యిచ్చింది.

అందరూ పనులకు పోయే తొందరలో ఉన్నారు.

మట్టిలో ఆడుతున్న నర్సవ్వ పెద్ద బిడ్డ సుజాతను తనవెంట తీసుకొని బయలు దేరింది.

పిల్ల తల్లిని సతాయిస్తున్నదని వారం రోజులుగా తన వెంట బడికి తీసుకపోతున్నది రాజేశ్వరి.

సుజాత మట్టి కొట్టుక పోయున్నది. జనుపనారలాంటి నూనె రాయని వెంట్రుకలు, మాసిపోయి ఉన్న బట్టలు.

"నర్సా పిల్లల మీద కోపమెందుకే వాళ్లను కొంచెం సురువుగ ఉంచరాదు - ఆ నెత్తులుసూడు" చూడలేకతనన్న మాట గుర్తొచ్చింది.

"నీదేంబోయింది బాగానే చెప్పుతావు - నా పనిగాదు నాకథగాదు వాగండాన పుట్టిండ్లు పోరగండ్లు-" నర్సవ్వ కోపంగా అన్నమాట గుర్తొచ్చింది.

సుజాత మొఖం కడిగి నెత్తిదువ్వి తను దువ్వుకుంది రాజేశ్వరి.

"అన్నం తిన్నవాబిడ్డా!" అని సుజాత నడిగింది.

సుజాత లేదన్నది. రాత్రి మారిన చింత పండు తొక్కేసి పిల్లకింత తినిపిచ్చి తనంత తిన్నది. ఇంటి ముందున్న బంతి, టమాట, మిరప చెట్లకు గోలెం అడుగునున్న నీళ్లు చెంబుతో ముంచి పోసింది...

టమాట చెట్లు పచ్చని పిందెలతో నవనవ లాడుతున్నాయి. ఎర్రని టమాట పండ్లు ఆమె మనసులో మెదిలాయి. మనుసు ఎక్కడికో పరుగు తీసింది. మొక్కజొన్న పెరట్లో గాలిమోత.

"కరకరార పాదుపాడిచేరా ఓ ...." మోట గేరె రాగంలో ఏదో గొంతు మోగుతోంది.

వద్దు అజ్ఞావకాలువద్దు - తనెందుకు ఈరోజు ఇట్లా అయిపోతున్నది. తన్నులు తిని వాకిట్లో పడిఉన్న కనకవ్వ ముఖం పదే పదే రాజేశ్వరిని వెంటాడుతోంది. తనే తనే అట్లాకూర్చున్నట్లు - ఏడుస్తున్నట్లు.

రాజేశ్వరి ఊరికనే ఇంట్లకు బయటకు తిరుగసాగింది. ఇంట్లోని ప్రతి వస్తువు తీసి పెట్టింది...

రాజేశ్వరి ఇల్లు ఒకే ఒక్కగది. గదిలో మధ్య అడ్డగోడ. ఇల్లు ఇంకా కట్టడం పూర్తి కాలేదు. ఇంకా సున్నం వేయవల్సిఉన్నది. గోడకు అవలి పక్క వంటసామాగ్రి. గిన్నెలు రెండు చిన్నకుండల్లో బియ్యం, పప్పులాంటివి ఉన్నాయి. గోడకు ఈవలి పక్క చిన్న కిటికీ దాని పక్క పాతకుట్టుమిషన్ దాని మీదుగా వెదురు బొంగు దండెం. దండెం మీద రంగురంగుల కుట్టిన జాకెట్లు, రిపేరు కొచ్చిన పాతబట్టలు. పక్క గూట్లో శుభ్రంగా ఉతికిన పాత చీరెలు, రవికెలు ఉన్నాయి.

ఆ ఇల్లు పరిసరాలు శుభ్రంగా కన్పిస్తున్నాయి.

అవ్వన్ని చూసుకొని రాజేశ్వరి పొడుగ్గా గాలి తీసింది. చెల్లాచెదురైనవన్నీ కూడదీసు కుని ఆఇల్లు కట్టడానికి తానెంత కష్టపడ్డది. ఎక్కడ పుట్టి, ఎక్కడ పెరిగి ఎక్కడ తిరిగి ఎక్కడి కొచ్చింది?

తను తన బతుకు ఎన్ని మలుపులు తిరిగాయి. మళ్లీ రాజేశ్వరి గతంలోకి జారుకుంటోంది.

తన బతుకంతా కొట్లాటనే - అయినా తను ఎవరితో కలువలేకపోయింది. ఎక్కడా నిలబడలేకపోయింది. తనెవరిని ఏమనకున్నా ఈ మనుసులు తనవెంట పడి తరిమి తరిమి కొట్టారు. ఎందుకట్లా చేశారు? ఎంతాలోచిం చినా రాజేశ్వరికి అంతు చిక్కదు.

తను లోకం చెప్పినట్టు వినలేదనా? నిజమే తనెవరిమాట వినలేదు. తనకు తోచినట్టు, తనకు నచ్చినట్టు బతకడానికి పెనుగులాడింది. లొంగిఉండాలి. తలెత్తవద్దు. ఇంటా బయటా అంతే. కాదుతనకు ఒక మనుసుంది అన్నందుకే కదా! అన్ని కష్టాలుపడ్డది. అయినా తను ఓడిపోయిందా? ఒంటరిదైపోయిందా? లేదు లేదు....

వింతగా చూస్తున్న సుజాతను చూసి రాజేశ్వరి ఉలిక్కిపడ్డది.

"పలక తెచ్చుకపో-పోదాం." రాజేశ్వరి సుజాత బుగ్గలు నిమిరింది.

సుజాత అంతా అర్థమైనట్టే పరుగెత్తింది. ఈ మనుషులంతా ఏదైతే సుఖాలనుకుం టారో? అవేవి తనకులేవు. అయినా తనుఅలాంటి బతుకు కోరుకోలేదు. తను ఈ లోకపు దబాయింపుకు బయపడలేదు. తనొక్కటే నలిగి పోయింది. కాని ఇవ్వాళ్ల ఈఊళ్లో ఎంతమంది కొత్త వెలుగుతోటి తెలివి తోటి మంచిదిక్కు నిలబడి...

కనకవ్వ, నర్సమ్మ, లచ్చుమక్క .... బతుకులు మారాయా? లేదు. కాని ఇవ్వాళ్ల ఊర్కోవడంలేదు. ఇట్లా కాదు కనకమ్మా గురించి ఏదన్నా ఆలోచించాలి. ఊళ్లో వాళ్లతో కలిసి ఆలోచించాలి.

ఒకప్పుడు తనలోపలి దు:ఖం చెప్పుకోవ డానికి ఒక్క మనిషన్నా దొరకలేదు. అంత అన్యాయం నాకే ఎందుకు జరిగిందని దినంరాత్రుళ్ళు ఏడ్చింది. చెప్పరాని కసితోటి కోపంతోటి లోకాన్ని కాలబెట్టన్నను కునేది. మనుషులందరిని గొంతు పిసికి చంపాలన్పిం చేది.....

కాని ఇప్పుడు చెప్పుకోవడానికి మనుషు లున్నారు. ఏడిచే మనిషిని అక్కున చేర్చుకొని సముదాయించే వాళ్లున్నారు. నిలదీసే వాళ్లున్నారు. న్యాయాలు, తప్పొప్పులు మారుతున్నాయి. బలవంతాన ఆలోచనలు తెగ్గొట్టుకొని టిఫిన్ డబ్బాలో అన్నం పెట్టు కున్నది రాజేశ్వరి.

సుజాతను తీసుకొని బయలుదేరింది. ఆ ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పక్కూరి స్కూల్లో ప్యూను పనిచేస్తోంది రాజే శ్వరి.

ఊరంతా సందడిగా ఉన్నది. యువకులు హడావిడిగా తిరుగుతున్నారు. పనులమీదికి పోయేవాళ్లు సద్దులు కట్టుకొని పోతున్నారు. వరిబంతులు కట్టేవాళ్లు ఎడ్లను పోగేసుకొని బయలుదేరుతున్నారు. అప్పటికే పనుల మీద పోయిన వాళ్లు బండ్లమీద వరిగడ్డి చేరకొడు తున్నారు. అక్కడక్కడ మిగిలిఉన్న పెద్ద వంగడాల వరి కోతలకు మరికొంత మంది పోతున్నారు. వరిగడ్డి వాసన కొత్తధాన్యం వాసన ఊరంతా కూడా.

ఆరోజు సాయంత్రం ఊరవతల మందోట కాడ మీటింగట. ఎన్నికల్లో గెల్చిన ఎమ్మెల్లేకు సన్మానసభ అసభ తాలూకూ హడావిడిలో చాలా మంది తిరుగుతున్నారు...

మీటింగు జరిగే స్థలంలో తోరణాలు కట్టడానికి గెలిచిన ఎమ్మెల్లేకు సంబంధించిన కార్యకర్తలు తీరపువ్వు రంగు అంగీలతో పోతున్నారు.

"అక్కా, జెర బడినుంచి తొందరగా రావాలె. మవాడ కట్టు మహిళలను నువ్వే జమ చేసుక రావాలె." బాలరాజు అనే కార్యకర్త.

"మీ ఎమ్మెల్లె హైదరాబాదులకు పోతడు. మా కట్టంమాదే గదా! రాజేశ్వరి నవ్వుతూ -

"అదే అడుగుండ్లి" బాలరాజు

వీధి మలుపులో శాయిరెడ్డి ఇంటి బంకుల కాడ వేపచెట్టు గద్దె మీద కొందరు కూర్చుండి కొందరు నిలబడి రాజకీయాలు మాట్లాడు తున్నారు. అందులో పోశాలుతాత, రాయమ ల్లు, మొగిలి కూడా ఉన్నారు.

ఛామనఛాయలో సన్నగా పొడుగ్గా, కళ్లు, ముక్కుసూటిగా కోసుగా పైకి కరుకుగా లోపల మృదువుగా, శుభ్రంగా ఉండే రాజేశ్వరితో చాలామందికి మాట కలుపాలని ఉంటుంది. ముప్పయై యేళ్లు దాటని రాజేశ్వరి చెదిరి పోయిన స్వప్నంలా ఉంటుంది. అకల రూపొందుతున్నట్టుగా ఉంటుంది. కోపంగా తీవ్రంగా ఉంటుంది. కాని దయగా కూడా ఉంటుంది. ముసలివాళ్లకు ఆమె స్వరం మెత్తగా మృదువుగా విన్పిస్తే - పడుచు వాళ్లకు కోపంగా విన్పిస్తుంది.

రోజు ఈసమయానికల్లా ఊరి పొలి మేరలు దాటేది రాజేశ్వరి.

"ఏంది బిడ్డా ఇయ్యాల్ల గింతాలిశ్యమ య్యింది?" పోశాలుతాత తన ముఖంలో పోశాలు ఏదో గుర్తుపట్టగలడని" ఉత్తిగనే పెదనాయిన" అనుకుంటూ రాజేశ్వరి ఆ గుంపునుండి తప్పించుకొని గబగబ ముందు కు నడిచింది.

పోశాలు తాతకు గాలి దుమారంలాగా మునిమాపు వేళ లింగయ్యతో పాటు బస్సు దిగిన రాజేశ్వరి రూపు కట్టింది. రేగిననెత్తి, మాసిన బట్టలు, చేతిలో బీడికట్ట, అగ్గిపెట్టె మనిషి నిప్పులా మండుతోంది. లచ్చుమక్క లింగయ్యకు దూరం చుట్టం. ఒంటిమీది బట్టసోయి లేకుండ లచ్చుమక్క ఇంట్లపడి ఉన్నది. లచ్చుమక్క దగ్గరికి తీసి పసిపిల్ల తీరుగ చూసుకుంటె నెలకుగాని మనిషి వాలకం పడలేదు... ఊళ్లో వాళ్లంతా కలిసి కష్టసుఖం అడిగి - పక్కూరి బల్లె ప్యూను పని పెట్టించారు. "మల్లమనుషుల్ల కలుత్తదను కోలేదు." పోశాలు తాతలోపల అనుకున్నాడు.

ఎవరో రాబోయే ఎమ్మెల్లేను ఏమేమి అడుగాలో ఎట్లా అడుగాలో చెప్పుకొస్తున్నాడు.

మొగిలికి మాత్రం రాజేశ్వరి అక్కడంతా పరిమళం నింపిపోయినట్లుగా ఉన్నది. ఆవాడు రాత్రి రాజేశ్వరితో తన్నులు తిన్నది గుర్తొచ్చింది. తనకు పెండ్లాం, పిల్లలున్నా ఒంటరి ఆడది అడుగుతే కాందంటుందా అని లోలోపల నిర్ధారించుకొని ముఖం చూస్తే భయం. ఒకరోజు బాగా తాగి వెళ్లి తలుపు తట్టాడు మొగిలి.

"నాకున్నదంత నీ పేరన రాస్త- నిన్ను పెండ్లి చేసుకుంట." మొగిలి తాగిన మైకంలో.

రాజేశ్వరి మాట మంతి లేకుండ వంగబెట్టి కట్టెల్లాంటి చేతులతో గుద్దింది. తాగిన మైకం దిగిపోయింది. దొంగకు తేలు కుట్టినట్టు మొ గిలి ఎక్కడ రాజేశ్వరి కల్సినా తలవంచుకొని తప్పుకుంటాడు.

రాయమల్లుకు రాజేశ్వరి మరోలాగా కన్పించింది. తనది రాజేశ్వరి ఉండేవాడనే రాజేశ్వరిని ఏమి చేయాలో ఎట్లా మనిషిని చెయ్యాలో లచ్చుమక్క మొదట చెప్పింది తనకే రాజేశ్వరి లోలోపల ఎంత యాతన పడ్డదో తను ఎరిగాడు. రాజేశ్వరి గురించి తనకు తెలిసిన కొత్త మనుషులకు రాయమల్లు చెప్పాడు. తను కలుగజేసుకున్నట్టుగ కాకుండా రాజేశ్వరి బాగోగుల గురించి పరోక్షంగా పట్టించుకున్నది రాయమల్లే...లచ్చుమక్క భర్త లింగయ్యకు రాయమల్లుకు మంచి దోస్తాని "ఇవ్వాల్లెందుకో అదోతీరుగున్నది" అనుకు న్నాడు రాయమల్లు.

రాజేశ్వరి పోశాలు తాత గురించి, మొగిలి గురించి. రాయమల్లు గురించి ఆలోచిస్తూ ఊరు దాటింది.

గుట్టబోర్ల పక్కనున్న సన్నని కాలిబాట మీది నుండి రాజేశ్వరి సుజాతతో కలిసి నడుస్తోంది.

పడమర కనుచూపు మేరదాక విస్తరించి యున్న పొలాలల్లో పశువుల మందలు మేస్తున్నాయి. అక్కడక్కడ మనుషులు పనుల మీద తిరుగుతున్నారు. బంతి కొడుతున్న ట్రాక్టర్ చప్పుడు టంక్ టంక్ మంటూ విన్పిస్తోంది. ఉత్తరం వేపున పత్తి చేన్లమీద పురుగుల మందు కొడుతున్న పవర్‌స్ప్రేయర్ల చప్పుడు ఘాటుగా మందువాసన గట్టు మీద నడుస్తున్న యువతి తీగెలాంటి గొంతుతో పాడుతోంది. పసుపు పచ్చగా పూసిన పొద్దు తిరుగుడు తోటల మీది నుండి గాలి తోలు తోంది. పొలాల మీదుగా కొంగల గుంపు ఎగురుతోంది.

రాజేశ్వరికి నరాల కొసలు అంటుకున్నా యి. పగిలి పోయిన స్వరంలాంటిదేదో లోలో పల ప్రతిధ్వనిస్తోంది. తెగిపోయి, నేలరాలిన కలలేవో అతుక్కుంటున్నాయి... పిచ్చిదానిలా రాజేశ్వరిచుట్టు పరికించి చూసింది. గొంతులో ఏదో గుర గురలాడు తోంది...

రాజేశ్వరి పక్క పొలంలోకి దిగింది. గరుకుగా కోసిన పొలం సుజాత బిత్తరపోయి దానిలో నిలుచున్నది ....

రాజేశ్వరి తమాయించుకొని మళ్లీ దానిలోకి వచ్చింది. వనికే చేతులతో సుజాతను తీసుకొని గబగబ కాలిబాట మీద నడువ సాగింది. ఆమెతో పాటే ఆమెగతానికి సంబం ధించిన నీలినీడలు కదిలాయి. ఆరుగురు అన్నదమ్ముల తోడబుట్టిన ఒక్కగానొక్క ఆడపిల్ల రాజేశ్వరి తల్లి వెంకటవ్వ. ఆమెను బయటకు పంపలేక 'ఇల్లుటం' తెచ్చుకు న్నారు. వెంకటవ్వకు ఇద్దరు కొడుకులు ఇద్దరు ఆడపిల్లలు. రాజేశ్వరి రెండవది. అదొక పెద్దకుటుంబం. పెద్ద భవంతి లాంటి ఇల్లు... ఆఊళ్లో ఆకుటుంబం స్థితిమంతుల కిందే లెక్క.

అంత మందిలో రాజేశ్వరి ఆడింది ఆట పాడింది పాట. ఆరుగురి తోడబుట్టిన ఆడబిడ్డ కనుక వెంకటవ్వకు గౌరవం తద్వారా రాజేశ్వరిని అత్తలు మామలు ప్రాణప్రదంగా చూసుకునేవారు. అందరు వ్యవసాయపు పనులు చేసుకునేవాళ్లు. బళ్లున్నా రాజేశ్వరిని స్కూలుకు పంపలేదు.

ఇంటి పెత్తనమంతా పెద్దమామ నారాయణదే. ఆయన మాటకు ఇంట్లో తిరుగులేదు.

రాజేశ్వరికి పెద్ద మామయ్య రూపం కళ్లల్లో మెదిలింది. పెద్ద మీసాలు, అంతెత్తు మనిషి. పంచాదులు చెప్పేకులపెద్ద. ఆయనకు రాజేశ్వరి పట్ల ప్రత్యేకమైన అభిమానం.

ఆయింట్లో తన తల్లిదండ్రులదేమి లేదు.

తను చిన్నప్పటినుండి మొండిగా ఉండేది. ఎక్కడేది జరిగినా పొట్లాటకు పొయ్యేది.

తనెప్పుడు ఆడపిల్లలాగా పెరుగలేదు. మొగపిల్లలతో కలిసి 'సెర్రగోనె' కబడీ ఆడేది. పశువుల కాసేది.

తను గోలీలు, ఆడితే పిల్లలంతా బెదిరి పోయేవాళ్లు. చెరువుల్లో ఈతలు, చెట్లెక్కడం, గాలపు చేపలు పట్టడం గుట్టబోర్ల మించి జారడం, ఓహ్ తాను అన్నిట్లోలీనమై ఎట్లా పెరిగింది? వాటకాలు భాగోతాలు, గొల్లసుద్దులు, ఒగ్గు కథలు, అన్నింటితో తను మమేకమయ్యింది.

చెమట మట్టి వాసనలతో పొలాల గట్ల నడుమ, వరిగడ్డి వాముల్లో తన చిన్నతనం గడిచిపోయింది.

తనెన్నడు ఇంటి పనివంట పనిచేసె రుగదు. మామలతో పాటు నాగలికట్టడం, కొండ్రలెయ్యటం మోటగొట్టడం, బండ్లు తోలడం, బంతులు కొట్టడం చేసేది పెద్దమామ మురిసిపొయ్యేవాడు.

అట్లా ఆడేపాడే తనకు అప్పుడు ఎనిమి దేండ్లు కావచ్చు ఊళ్లోని దూరపు మామ కొడుకు కొమురయ్యతో పెళ్ళి చేశారు. అప్పుడు పెళ్లెందో తనకు తెలియదు. అట్లా తనకేమి సంబంధం లేకుండానే తన బతుకును మరొకరితో ముడిపెట్టారు.

అత్తగారికి ఆఊళ్లో భూమిజాగా లేదు. పనుల కోసం ఊళ్లు తిరిగేవాళ్లు. పెళ్లి జరిగింది గాని పదహారేల్లదాకా మామల యింట్లోనే గడిచింది.

ఆదారి పక్క వందగజాల దూరంలో ఒక యువతి వరి మోపుతో కల్లంకేసి నడుస్తున్నది. ఆపిల్ల నడుము కాళ్లు మాత్రమే కన్పిస్తున్నాయి. ఇంతలో వెనుక నుంచి ఎవరు శివయ్య ఎదురొచ్చి తను ఆమోపు కిందికి .... ఛీ ...ఛీ ఏమి చేశాడు. ఆపిల్ల ఏదో మురిపెంగా అంటోంది.

శివయ్య రాజేశ్వరిని చూచి సిగ్గుపడి పొలంలో వరిగడ్డి కాళ్లతో సహా పరుగెత్తాడు.

రాజేశ్వరి నడుస్తోంది. సమ్మోహనమైనదేదో ఆమె ఒంట్లో పాకింది.

"నీకింత బలమెక్కడిదే?" చిత్రమైన గొంతుతో ఎవరో తన చెవి దగ్గర గుసగుస లాడుతున్నాడు.

శంకరి. ఔనుశంకరి. తను పక్క పేరదు శంకరిది. తనకు ఒళ్లు, ఊహలు, కలలు మెల్కొంటున్న సమయంలో శంకరి జత కలిశాడు. రోజు పెరండ్ల దగ్గర గంటల తరబడి మాట్లాడుకునేవాళ్లు శంకరి గొంతు బావుండేది. తనకు అతగాన్ని విడిచి ఉండడం కష్టమయ్యేది.

ఊరికే తనకేసి చూసేవాడు.

తను అతని పొడగాటి ముక్కు, వొత్తయిన వెంట్రుకలు చూస్తుంటే "పెండ్లంటూ చేసుకుంటే నిన్నే చేసుకుంట" అనేవాడు.

శంకరి జ్ఞాపకంతో రాజేశ్వరి కళ్లు నీళ్లతో నిండిపోయాయి. పొలాల గట్ల మీది నుండి అలలు అలలుగా తేలివచ్చే వొంటరి రాగమేదో ఆమెను చుట్టుముట్టింది.

"అయ్యో శంకరి - ఉచ్చితార్థంగా పాణం తీసుకుంటివి". రాజేశ్వరి చెంపలపై కారే నీటిని తుడుచుకున్నది.

రాజేశ్వరికి పెండ్లి భర్త కొమురయ్య మనుసులో రూపుకట్టాడు. నల్లగా పొట్టిగా ఉండేవాడు. నప్పతట్ల మనిషి ఏనాడు తను ఆమనిషిని భర్తనుకోలేకపోయింది. తను అన్ని రకాల ఎరిగి, ఇష్టపడిన

శంకరే అన్ని అనుకునేది. పెనిమిటి అనుకునేది.

అది తప్పని తనకు తోచేదికాదు.

ఆరోజు తను పెరడి దగ్గరినుండి సాయం కాలం ఇల్లు చేరింది. ఇంట్లో కొము రయ్య, అతని తల్లిదండ్రి మనుసు అగులు బుగుల య్యింది. తను ఒక్క మాటన్నా మాట్లాడకుండ లోపలికి వెళ్లి పడుకున్నది.

"ఏంది బిడ్డ మీఅత్తమామలొచ్చిండ్లు మాట్లాడవ." అమ్మా నెత్తిమీద చెయ్యేసింది.

"నేను రానుపో" తను ఆపూట అన్నం తినలేదు. పొద్దున్నే లేచి పెరడికాడికి పోతే రాత్రి అయ్యేదాకా వచ్చేదికాదు. అదీ తప్పించుకొని - మూడురోజులు గడిచి పోయాయి.

రోజు తల్లి బతిమిలాడుతూనే ఉన్నది... మనుసు ఆగమాగం గున్నది. అమూడు రోజులు శంకరి కలువలేదు.. అత్తమామ పిల్లను తీసుకపోతమని అనేమాటలు తను వింటూనే ఉన్నది. నాలుగోరోజు శంకరి కలిసిండు. "కాళ్లు చేతులు కట్టి తీసుకపోతరు శంకరీ!"తను గజగజ వనుకుతూ.

"నేను ప్రాణాలతో ఉండగ నిన్ను తీసుకపోనిత్తనా! భయపడకు రాజీ" శంకరి తనను దగ్గరికి తీసుకున్నడు.

"నాకా మొగడు ఇట్టంలేదని చెప్పు" మళ్లీ శంకరే కాళ్లీడుస్తూ సాయంకాలం ఇంటికొచ్చింది. అప్పటికీ తెల్లకల్లు, గుడాలు ఇంట్లో అందరు పెద్దగా మాట్లాడుకుం టున్నారు.

పెద్దమామ నారాయణ 'అర్ర' లో పడుతున్న తనదగ్గరి కొచ్చి కళ్ల నీళ్లు పెట్టుకుని "బిడ్డా రాజువ్వ ఇన్ని దినాలు మాయింట్ల లేడిపిల్ల తీర్గ తిర్గినవ్ - అత్తగారింటికి పోతావే." అన్నాడు.

"పిల్లిట్లో అంటరేంది? తనకు యిష్టం కష్టం ఉండదా? ఏ మెరుకేలని పోరికి పెండ్లి జేసిండ్లు, నచ్చని మొగనితోని సంసారం జెయ్యమంటరు. ఈమామ చూసే ప్రేమంతా ఉత్తదేనా? తనకు నచ్చలేదని చెప్పితే - మామ గుడ్లురుముతడు. తనకు దొంగ ప్రేమవద్దు. తను వీళ్లందరి కోసం బతుకది. తనకోసం బతుకుతది. తను కొట్లాడే తీరుతుంది. "మనుసులో మొండితనం ప్రవేశించగా

"నేను కొమురయ్యతో పోను" తన గొంతు కరుకుగా నారాయణ ఖిరిసొయ్యిండు. తేరకోకముందే "శంకరిని పెండ్లి చేసుకుంట" గబగబ చెప్పింది.

మామ మొదట విస్తుపొయ్యాడు. అర్థమ యిన తరువాత తాగింది దిగిపోయింది. పండ్లు పటపట కొరికి -

"లంజెముండా! ఏం మాట్లడుతన్నవే - నీ మామలు పంచాదు పెద్దమనుషులే - అ శంకరిగాన్ని నరికి పోగులు పెడుత - వానికి ఎన్ని గుండెలే. గెట్టుకాడ ఎన్నిపగలో నీకు ఎరుకలేదే. పక్కలో పాములే వాని తల్లిదండ్రులు పిచ్చి పిచ్చి నకురాలు చేత్తే సంపి పెరట్ల బొందవెడుత" మామ పెద్ద గొంతుతో, పిచ్చి కోపంతో అరవసాగిండు.

ఇంట్లో అందరికి అర్థమయ్యింది. కొముర య్య తల్లి శోకాలు పెట్టింది... ఇల్లంతా నిశబ్దం. అందరు గజగజలాడుతున్నారు. పెద్ద మామ రంకె లేస్తూఎవరినో అంతూ పొంతూ లేకుండ తిడుతూనే ఉన్నాడు.

తనకు అంతకన్నా మొండితనం వచ్చింది. సంపుతడా సంపనీయ్. పెద్దత్త దగ్గరికొచ్చింది.

"పెల్లా మీమామ సంగతి నీకు ఎరుక లేదా? సప్పుడు చెయ్యక నీజాగల నువ్వు పో. నలుగురింటె నాలుగు లోకాలిన్నట్టు"

నేనంతకన్న మొండిదాన్ని నన్ను నరికి నా శంకరితోనే ఉంట" అంతకాన్న గట్టిగా చెప్పింది అందరు వినాలనే.

ఎందుకో మామ మాట్లాడలేదు. అరాత్రే అత్తమామలు కొమురయ్య వెళ్లిపోయారు.

అట్లా పోయిన వాళ్లు ఊరంతా చెప్పు కున్నారు. ఇంట్లో వంటలేదు వార్పులేదు. తను అర్రలనుండి బయటకేరాలేదు.

రెండోనాడు కొమురయ్య తల్లిదండ్రులు దొరను కలిశారేమొ? పట్ట పగలు సుంకరో డచ్చిండు. వాడేమన్నాడోగాని పెద్ద మామ అర్రలకచ్చి "మా ఇంట్లో చెడబుట్టినవ్‌గదే" నంటూ వంగబెట్టి వీపు మీద గుప్పి గుప్పిన గుద్దసాగిండు.

"ఆడపిల్లనట్ల కొడుతవేందయ్య" పెద్దత్త అడ్డంవచ్చింది.

పెద్దత్తను రెండేసి బజాట్లోకి పోయిండు. "నేను రానని మీదొరకు చెప్పుపో. ఏంజేసు కుంటడో చేసుకొమ్మను". పెద్దమామ గొంతు.

"రాయేశ్వరిలేవి పెక్కరిదెత్తివే. దొరోడు కాలాంతకుడే". నడిపిమామ.

"నదేం బుద్దే - శంకరికి నలుగురన్న దమ్ములు పంచుకుంటే గుంటెడు జాగరాదు... వాన్ని కట్టేసి ఇది నీకు తగదన్నరట." నడిపిమామ.

"అన్న జాత్తె గట్లున్నడు. శంకరి తాతల కాన్నుంచి మనకు వాళ్లకు పగలున్నయి. తెల్లగ పుల్లగ బతుకుతున్న మని దొరోనికి మనమీద కండ్లమంట. పెద్దన్న వానింటికిపొదం. దొరోడు పోలీసులకు చెప్పుతడు. రాయేశ్వరి ఇది అయ్యేదిగాదే". నడిపిమామ....

రాజేశ్వరి కళ్లనిండా నీళ్లు తిరిగాయి. జ్ఞావకాలన్నీ అలుక్కుపోయినట్టు - ఎవరో గొంతు నొక్కి పట్టినట్టు - కాలిబాట మీదినుండి బండ్లబాట మీదికొచ్చింది... ఎదురుగా దుమ్మురేపుకుంటూ జేబు వచ్చింది. సుజాత ను ఎత్తుకొని పక్కకు జరిగి నిలుచు న్నది.... జేబునిండా పోలీసులే.

"ఎందుకు కొత్తండ్ల....." రాజేశ్వరి....

జేబులో మాజీ సర్పంచ్ నర్సింగరావు బీరపువ్వు అంగేసుకొని తల ఊతలకుబెట్టి చిరునవ్వు నవ్వాడు.

"ఓహో ఎమ్మెల్లే వత్తండుగదా! ఏంగడబిడ లేకుంట ఏర్పాట్లు చూసిపోతరేవీలు?" రాజేశ్వరి.

జేబు రేసిప దుమ్ము మణిగింది. రాజేశ్వరి బండ్లబాటలో నడుస్తోంది. గుట్టబోరుమీద కాబోలు తీతువ పిట్ట అరుస్తోంది.... 'దచ్చన్న దానిలో' అంటూ ఎవరో పాడుతున్నారు గొంతె త్తి - కల్లాలదగ్గర అడుక్కునే 'సారథికాళ్ల వీణనాదం, బుర్రల శబ్దం లయగా విన్పిస్తు న్నాయి.

రాజేశ్వరికి పోలీసుస్టేషన్ గుర్తొచ్చింది. తనను జేబులో కుదేసుకొని స్టేషనకు తెచ్చారు.... లాకపులో శంకరి - ఒళ్ళంతా దెబ్బలతో కమిలిపోయి సోయి దప్పిపోయి నట్టున్నవాన్ని తనముందునుండే నడిపించుక పోయారు.

తనకు ఏడుపొచ్చింది. కొపమొచ్చింది. పెద్దనోరుతో అరుస్తూతి ట్టింది. అదే లాకప్‌లో పడేసి తనను కొట్టారు. దెబ్బదెబ్బకు గట్టిగా తిట్టింది.

"అది నా ప్రాణం దాన్నే మనకుండ్లి." శంకరి గింజుకున్నాడు. అరుస్తున్నాడు.

సాయంత్రదాకా కొట్లు, తిట్లు, సాయం త్రానికి పెద్దమామ వచ్చి తనను విడిపించు కుపోయాడు...

రాజేశ్వరికి ఆ దెబ్బలు ఇప్పుడిప్పుడే తాకినట్టుగా ఒళ్లంతా నొప్పిగా తోచింది....

రాజేశ్వరికి పంచాది గుర్తొచ్చింది. అందరు తలోమాట అంటున్నారు. తను చూరుకింద నిలుచున్న తను మందలోకి పరుగెత్తింది.

"నేను మనిషినే - నన్ను కొట్టినా తిట్టినా - నాకే సంసారం ఇట్టంలేదు. నన్ను నిలువున నరుకుండ్లి." గబగబ అక్కన్నుంచి వెళ్లిపో యింది.

పెద్దమనుషులు తలో మాటన్నారు - పొగరన్నరు. దీన్ని చూసి నేర్చుకుంటరన్నరు. ఇది ఊరా అడివా అన్నరు. పెద్ద మామ చప్పుడు చెయ్యలేదు.

రెండు తులాల బంగారం - వెయ్యి రూపాల తప్పుదండుగ కట్టి విడాకులు రాయించి తనను వేలి ముద్దరేయించిండ్లు -

రాజేశ్వరి స్కూలు చేరుకున్నది...

అప్పటికే ప్రార్థనకోసం పిల్లలు లైన్లు కడుతున్నారు.

రాజేశ్వరి గబగబ నడిచింది.

★ ★ ★

మధ్యాహ్నం బెల్లయ్యింది. చాలామంది పిల్లలు ఇళ్లకు వెళ్లిపోయారు. ఆరుగురు టీచర్లు వెళ్లిపోయారు. అది అప్పర్ ప్రైమరీ స్కూలు. పక్క ఊళ్లోనుండి వచ్చిన పిల్లలు టిఫిన్లు తిని ఆటల్లో పడిపోయారు.

రాజేశ్వరి తను తెచ్చుకున్న టిఫిన్ తనుకొంత సుజాతకు కొంచెం తినిపించింది.

బడికి కొంచెందూరంలో చెరువుకట్ట - చెరువుకట్ట ఉత్తరం సాగిపోతుంది. చెరువు పక్కనే పెద్దమర్రిచెట్టు. ఆకట్టకింద నుండి ఆ ఊరుబాట - బాటకు ఎడంగా స్కూలు - స్కూలును ఆనుకొనే వరిపొలాలు. స్కూలుకు కొంచెం దూరంలో ఏ నాటిదో పాతగుడి - చెరువులో చాకలివాళ్లు బట్టలుతుకుతున్న చప్పుడు.

బడిముందు తానే కొన్ని మొక్కలు వేసింది. మేకలు తినిపోగా కొన్ని తీగలు పెరిగిపోయాయి. బడిముందు అయిదారు పెద్ద వేపచెట్లున్నాయి.

మనసంతా ముద్దలాగా అయిపోగా రాజేశ్వరి ఒక వేపచెట్టు మొదట్లో కొంగు పరుచుకొని ఒరిగింది.

పిల్లలు బంతాట ఆడుతున్నారు. సుజాత తన వయసు పిల్లవానితో కలిసి మట్టిలో ఆడుకుంటోంది.

తనకి బిడ్డ పుడితే....

రాజేశ్వరికి ఒళ్లంతా ఏదో పాకినట్ల నిపించింది.

తనకేమయ్యింది? ఎన్నడులేంది ఇట్లా ఆలోచిస్తున్నది. కొమ్మను వీడిన ఆకులాగా తను గాలిలో ఎగిరింది. దుమ్ముతోపాటు సుళ్లుతిరిగింది. రాజేశ్వరి కళ్లుమూసుకున్నది.

"ఇంకెన్నిరోజులు ఆగాలె నావశమై తలేదు." శంకరి తన కళ్లుమూసి గుసగుస లాడాడు.

ఇంట్లో, బయట అనాదరణకు గురై -ఏమయ్యిందో తను చేసిన తప్పేందో అర్థం కాక - తోడుకోసం రెపరెపలాడుతున్న స్థితి తనది.

తను ఔను కాదనకుండానే - శంకరి తనను గడ్డివామచాటుకు లాక్కుపోయాడు... అది దుఃఖమో, సంతోషమో తెలియని స్థితిలో శంకరితో తను కల్సిపోయింది...

అంతకంతకూ తన మనసులో గాలిదు మారం పెద్దదైందే కాని తగ్గలేదు. లోపలి ఒత్తిడి తగ్గించుకోవడానికి వీరావే శంతో వ్యవసాయపు పనుల్లో కూరుకు పొయ్యేది.

అర్థంకాని భయాలు-రోజు శంకరి తను కలువడాలు - కాలం గడుస్తోంది...మొదటి భర్త అడ్డు తొలిగిపోయింది. పెండ్లి చేసుకో కతప్పదు. ఇంట్లో చెప్పక తప్పదు.

ఇంట్లో సూటిపోటి మాటలు పెరిగాయి. తను సాకుగా ఉమ్మడి కుటుంబంలో లోలోపల ఏదో మసులుతోంది. పెద్దమామ తనకోసం ఖర్చు పెట్టాడని మిగతా మామలకు లోపల ఉంది. పెద్దమామ మునుపటిలా మాట్లాడటంలేదు. పంచాతులకు పోవడం లేదు. తనకు అంతా అర్థమౌతూనే ఉన్నది. తను ఈ ఇంట్లో ఉండజాలదు. పోనీ ఎవరికి చెప్పకుండా శంకరి దగ్గరికి పోతేనో? ఇది వేరే ఊరుకాదు.

"అవ్వా నేను శంకరి ఇంటికి మారుమ నువుపోత" తను తల్లితో.

తల్లి తల్లడిల్లిపోయిందో? తన అన్నల సంగతి తనకు తెలుసు "రాజవ్వ నీకెట్ల చెప్పన్నే - ఈ యింట్ల మీ పెద్దమామకు నచ్చకుంట ఏది జరుగది". తల్లి ఏడ్చింది.

పెద్దత్త వచ్చింది... తన తల్లిని ఊకుం చింది. ఏమనుకున్నదో ఏమో పెద్దమామ అర్రలకు పోయింది.

"ఏందయ్యా నీ పట్టింపు నీదేగాని. ఆ పిల్ల మంకు విడువదాయె నీమంకు నీదేనాయె.... ఆడిపిల్ల ఉసురుపోసుకోకు -" అత్తమాట విన్పిస్తూనే ఉన్నది.

తన గుండె కొట్టుకోవడం మానేసింది. ఆ తరువాత మాటలు లేవు. అవ్వ ఏడుపు నాపింది.

"పోయె" - మామగొంతు - అడుగుల చప్పుడు.

ఎడం చేతిలో కందీనా కుడిచేతిలో ఏదో డబ్బా పట్టుకొని అర్రలకొచ్చాడు. డబ్బా తనముందు పెట్టాడు.

"ఇది విషం నువ్వు తాగతవా? నన్ను తాగుమంటవా?" అతని కండ్లు మండు తున్నాయి. మనిషి వనకుతూ నిలబడ్డాడు.

తనకు తెలుసు మామమొండి తనమే తనకొచ్చింది. తను తాగకుంటే - గటగట తాగేత్తడు.

మనసంతా ఎడతెగని పోట్లు. లోపల శంకరి చేతులు చాచి పిలుస్తున్నాడు. కాని మామ శవం.

తను తలతల్లి చేతుల్లో పెట్టుకొని పెద్దపెట్టున ఏడ్చింది. ఇంట్లో వాళ్లంతా పరుగెత్తుకొచ్చిరు. కాని ఇంటి యజమానిని ఆ రూపంలో చూసి ఎవరు మాట్లాడానికి సాహసించలేదు. పెద్దత్త ముందుకు రాబోయింది. పెద్దమామ నెట్టేసిండు.

రాజేశ్వరి ఆ పురుగు మందు డబ్బా తీసుకొని గటగట తాగేసింది. అందరు హా హా అన్నారు....

ఎవరికి పాలుపోలేదు. ఏమి చేయాలో ఎవరికి తోచలేదు. ఆ గడబిడలోనే తన కళ్లు మూతలు పడిపోయాయి.

కండ్లు తెరిచి చూసేసరికి దవాఖాన ఉన్నది.

"నన్నెందుకు బతికిచ్చిండ్లు బతికున్న సచ్చిందానికిందే లెక్క" తలబాదుకున్నది.

రాజేశ్వరి కళ్లు కారుతున్నాయి. బాటమీద గడ్డిబండ్లు పోతున్నాయి.

రాజేశ్వరి అదే పిల్లలకేసి వెర్రిగా చూసింది. అక్కడే దవాఖానలో తన గర్భం తీయించారు. ఆమె శరీరం, మనసు కొల్లగొట్టబడి - తన జీవశక్తి కోల్పోయిందక్కడే. తను ఎగిరే ఆడే పాడే రాజేశ్వరి లాగారాలే - తన శవంవచ్చింది.

పెద్దమామ శంకరినేంజేశాడో - శంకరి మల్ల కలువలేదు. తనే కలువాలనుకోలేదు. తను ఈ గొడువంతా లేకుండా శంకరితోపాటు పారిపోతే - ఆ ధైర్యం ఎందుకు చెయ్యలేక పోయింది. తనది ఎద్దితనమే. తనది గొడ్డు తనమే.

తను ఇంట్లోనుంచి చానొద్దులు బయట కు రాలేదు. ఇద్దరు మామయ్యలు విడిపోయి వేరు కాపురాలు పెట్టారు. తనతో మాట్లాడే వాళ్లుగాని, లేచి తిరుగుమనే వాళ్లుగాని ఆ యింట్లో ఎవరు లేకపోయారు. రోజులకు రోజులు పడుకునే ఉండేది. అందరు పడుకు న్న తర్వాత రాత్రిల్లు పిచ్చిదానిలా తిరిగేది - వెక్కివెక్కి ఏడ్చేది....

రాజేశ్వరి కళ్లు తుడుచుకున్నది. సుజాత మట్టి పూసుకున్నది. ఊరి పిల్లలు రెండోపూట బడికి వస్తున్నారు. రాజేశ్వరి సుజాతను తీసుకొని చెరువుకేసి నడిచింది.

కట్ట ఎక్కేసరికి చాకిరేవులో చాకలి రాంబాయి ఒక్కట్టే బట్టలుతుకుతోంది. మిగతా చాకలివాళ్లు చెరువులో దిగి స్నానాలు చేస్తున్నారు. ఆడమగా పరాచికాలాడు కుంటు న్నారు. ఈతలు కొడుతున్నారు.

"ఇయ్యాల్ల ఆలిశ్యమయ్యింది రాంబా యక్కా" రాజేశ్వరి.

"నా అనువవం కన్నోడు నుకపెట్టకపాయె - కట్టుకున్నోడుసుఖపెట్టకపాయె. మామడేలు ఎమ్మెల్లోనో మారెవలో అత్తండ్లని సింగులు తన్నుకుంట తిరుగవట్టే."

కోపాన్ని బట్టలమీద చూపెడుతూ రాంబా యి.

"మీ అయన సంఘ పెద్దగదా!" రాజేశ్వరి.

"పేరు పెద్దదేగాని ఇంటికిత్తురాదు ....సారబందంట తిరుగుతే మామలు తీసుక పోయి దంచిరి." రాంబాయి.

బట్టలు కట్టమీద ఎండవేయబోయిన రాంబాయి కూతురు వచ్చి నిలుచున్నది.

రాంబాయి కూతురు సుశీల భర్తతో పరాయి ఊళ్లో ఉండలేక పుట్టిన ఊరు మీద మమకారం చావక తండ్రి దగ్గరే ఉంటోంది. భర్త కాళ్లరిగేలా తిరిగి మల్ల పెండ్లి చేసు కున్నాడు.

ఆ పిల్ల ముఖంలోకి రాజేశ్వరి చూడలేక పోయింది.

"ఏందయ్య రాంబాయక్కకు తలో చెయ్యి వెల్తేగదా!" రాజేశ్వరి.

ఆ మాట మీద ముగ్గురు వచ్చి మిగతా బట్టలు పిండేశారు.

చాకలివాళ్లు మీటింగు తొందర్లోనే ఉన్నా రు.

రాజేశ్వరి తూము దగ్గరికి నడిచి సుజాత ముఖం కడిగింది. తను నీళ్లు ముఖం మీద పోసుకుంటుంటే మళ్లీ పుట్ట చెదిరింది. నీళ్లల్లో ఎన్నో ఎన్నెన్నో ప్రతి రూపాలు....

సుజాతను తీసుకొని గబగబ కట్టదిగి స్కూలుకేసి నడిచింది. స్కూల్లో గంట మోగుతోంది.

★ ★ ★

సాయంత్రం అయిదుగంటలయ్యింది. అప్పటికే కొద్దిగా చలి షురువయ్యింది. మాగిపొద్దు క్రుంకడానికి సిద్ధంగా ఉన్నది. వీధిలో జనం హడావిడిగా మాట్లాడుకుంటూ తిరుగుతున్నారు.... రావాల్సిన ఎమ్మెల్లే ఇంకా రెండు గంటల్లో వస్తున్నట్లు మంగలి శాయన్న పెద్ద గొంతుతో అరుస్తూ చెప్పుకుంటూ పోతున్నాడు. వడ్లరాజయ్య మూడు బజార్ల దగ్గర బాగా తాగి ఊరివాళ్లను, ఎమ్మెల్లేను కలిపి తిడుతున్నాడు. అతని భార్య అంతకన్నా పెద్దనోరుతో చాటుగా 'గుడుంబా' కాచేవాళ్లను తిట్టి పోస్తోంది.

రాజేశ్వరికి మెదడు మొద్దుబారినట్టుగా ఉన్నది. ముట్టుకుంటే జలజల పొంగిపొరలే గంగలాగున్నాయి ఆమె కళ్లు.

వానపడి నానిన నేలలా ఉన్నది ఆమె అంతరంగం. బడినుండి వచ్చి ఇంటిముందు గడపమీద కూర్చున్నది.

"అక్కా నువ్వింకా తయారు కాలేదా?" లలిత పరుగెత్తుకుంటూ వచ్చింది.

రాజేశ్వరి లలిత ముఖంలోకి చూసింది. లలిత పూసిన తంగేడు చెట్టులాగునున్నది. ఆమె ఆ వూళ్లోకి వచ్చిన కొత్తపాటలను గొంతెత్తి పాడుతుంది... పొంగి పొరలే కొండవాగులా గలగల మాట్లాడుతుంది.

రాజేశ్వరి అట్టాచూసి తను పక్కకొచ్చి కూర్చున్నది. రాజేశ్వరి చెయ్యిని చేతిలోకి తీసుకున్నది. రాజేశ్వరి ఒక్కపెట్టున బద్దలై భోరున ఏడిచేదే - కాని అంతలోనే నర్సమ్మ వచ్చింది.

ఎందుకోగాని నర్సమ్మ శుభ్రంగా తల దువ్వుకొని బంతిపూవు తలలో పెట్టుకున్నది.

"ఏమే మరదలా! పప్పన్నం ఎప్పుడు పెడ్తావ్" నర్సమ్మ.

"ఆ అలులేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం అంట - మీ తమ్ముడు జేల్లబొయి కూసున్నాడు గదా" లలిత.

"ఎమ్మెల్లేను మనూరోల్లను ఇడిపియ్య మంటరట మానాయిన చెప్పిండు." నర్సమ్మ.

"ఔగని - ఇయ్యాల్ల బావగిన గాలిమోటర్ల అత్తన్నని కబురుపంపిండా" లలిత.

"ఆ ( మీనర్సొక్కుల బావగంత పాటా?" నర్సమ్మ.

" ఏమక్క తయారుగావు, వంటయ్యిందా? ఈ పూట మాయింట్లనే తినరాదు." నర్సమ్మ.

"లేదమ్మా - మీరట్లా కూండ్లి నేను తయారేంత." రాజేశ్వరి లేచి నిలబడింది.

లలిత "పోయత్తనక్క .... సుక్కు తయారయ్యిందో చూసొత్త" లేచింది.

మైకులో 'గద్దర్' పాటలు విన్పిస్తున్నాయి.

రాజేశ్వరి పొయ్యంటించి పొయ్యి ముందుకూర్చున్నది.

తను లలిత లాగే ఉండేది. తనలోపలి ఆ చలాకితనం ఎవరు తీసుకున్నారు .... శంకరా? పెద్దమామయ్యా! రాజేశ్వరికి తెలనే లేదు. పొయ్యిలాగే ఆమె అంతరంగంలో మంటలు.

శంకరి పెళ్లి జ్ఞాపకం వచ్చింది. వాళ్ల అన్నలు బలవంతగా పెళ్లి చేశారు.... శంకరి ఆ పెళ్లితోనే అదిలిపోయిండు.

తను కుంగి పోయిందా? కుప్పకూలిందా? ఏది కాలేదు. అదంతా తను అనుకున్నదే - తను తేల్చు కోలేనిదే - తనెప్పుడు ఏదీ తేల్చు కోకుండానే బతుకు సాంతం గడిచి పోయింది.

తను చాలారోజులు ఇంటి గడుపదాటలేదు. ఇంట్లో అందరు తనతో మాట్లాడే వాళ్లుకాదు. తను తిన్నదో తినలేదో పట్టించుకున్న వాళ్ల లేరు. తనతల్లి దగ్గరికి తీసుకుంటుందని "లేబిడ్డా!" అని అంటుందని ఆశపడేది. రాత్రిల్లు కళ్లు తెరుచుకొని ఉండగానే

గడిచిపొయ్యేది! ఎవరైనా ఎట్లున్న దానివి ఎట్లయినవని అంటారనుకునేది. తను చేసిన తప్పేందో అర్థమయ్యేదికాదు. గలగల మాట్లాడేతను మూగమొద్దయిపోయింది.

పెద్దమామ లోలోపల కుమిలిపోతున్నట్టే ఉన్నాడు. మంచంలో పడ్డాడు. ఏమందు పనిచేయలేదు. తన ఉసురేతాకిందనుకునేది.

తనకు రోజురోజుకు లోపల యాతన ఎక్కువయ్యింది. భరించవశంకాని యాతన పనికి అలవాటయిన శరీరం కూర్చోనియ్యలేదు. పెరట్లకు పొయ్యి ఎద్దులాగా పనిచేసేది. అయినా ఎవరికి పట్టలేదు. తెలియని కోపం అంతకంతకు పెరిగిపోయింది. అ కారణంగా అందరిని తిట్టేది. ఊళ్లో ఎక్కడే గొడవ జరిగినా పరుగెత్తేది ... ఎంతటి వాళ్లయినా తిట్టిపోసేది. ఎవరిని ఖాతరు చేసేది కాదు. అట్లా తిట్టినంక కొంత ఊరట పొందేది.

అడవాళ్లను పరాచికలాడే నర్సయ్యను నడిబజాట్లో నిలబెట్టి "నీకు సిగ్గు శెరం లేవా" అని తిట్టి పోసింది. బడిపంతులు భార్య అందమైనది. అకారణంగా బడి పంతులు కొడితే ఎవరు పిలువకుండానే తను వెళ్లి "నీ అనుమానం మండ - బంగారమసొంటి మనిషిని తిట్ట నీకు నోరెట్లా వస్తోంది , ఛీ - చదివివోనికన్నా సాకలోడు నయమని" తిట్టి పోసింది.

తనను చూస్తేనే ఊళ్లో వాళ్లు బెదిరిపొయ్యేవాళ్లు - ఎవరికేదొచ్చినా వచ్చి చెప్పుకునేటోళ్లు, మంచి అనిపించినదిక్కుకరాకండిగా మాట్లాడేది .... తనుదేన్ని ఖాతరు చెయ్యని మొండి మనిషయ్యింది.... తనకు అన్ని పోయినంక దేనికైనా ఎందుకు భయపడాలి?

కాపురామక్క గుర్తొచ్చింది రాజేశ్వరికి. అమె బిత్తిరి భర్త పిల్లలు గుర్తొచ్చిరు. అమె మీద దొర చేసిన అత్యాచారం గుర్తొచ్చింది. రామక్క కాళ్లు చేతులు కట్టేసి మొక్కజొన్న పెరట్లో పారేసింది జ్ఞాపకం వచ్చింది. అమె పక్క పిచ్చి చూపులు చూస్తూ ఆమెభర్త నిలుచున్నాడు. అ ఒంటరి మనిషిని అదుకునే వాళ్లెవరు లేకపోయారు. అందరు వచ్చి చూసిపోయేవాళ్లే - తను తెలిసి పరుగెత్తింది. బట్టలు సదిరి ముఖాన నీళ్లు చల్లింది.

"రాయేశ్వరక్కా నా బతుకు మంట్లో కల్సింది." తనమీదపడి ఏడ్చింది.

"ఊకో రామక్కా - మొగోనికి లేని తప్పు నీకెక్కడిది? నీకోసం, నీ పిల్లల కోసం నువ్వు బాధపడకు."

కసితో, ద్వేషంతో ఊళ్లో వాళ్లందరిని తిట్టింది. ఊళ్లో వాళ్లు మాట్లాడలేదు..... అదే మంటలో పోలీసు స్టేషనుకు నోయింది. వాళ్లు పట్టించుకోలేదు .... దొరింటిమీదికి పోయితిట్టింది, పట్టించుకోలేదు.

తను ... తను ఇదంతా ఎవరిమీద కోపంతో చేసినట్టు శంకరిమీదనా? మామమీదనా? తనమీద తనకేనా? పైకి ఎంత కోపంగాఉన్నా - ఎంత రంకులదానిగా తిరిగినా లోపల తను అన్ని రకాలుగా ఓడిపోయింది.

˝కుటుంబం వేర్లు పడ్డారు. మూడిండ్ల భవంతిలో ఒకిల్లు తమకిచ్చారు. తడుకలు కట్టుకున్నారు.

తను ఓడిపోయింది? అ ఊరు తన పర్వస్వాన్ని ఒలుచుకున్నది. తనను తిరస్కరించింది తనింక తనను పట్టించుకొని ఊళ్లో ఉండలేకపోయింది.

కొంత డబ్బు తను కూలి చేసి కూడబెట్టుకున్నది తీసుకొని రామక్కకు చెప్పి బయటపడింది.

అరోజు ఇంకా తెల్లవారని చీకటి విచ్చుకోని అ తెల్లవారు ఝామున - రామక్క ఇంటి ముందు కాళ్లమీద కూర్చున్నది గుర్తొచ్చింది.

"అయినోళ్ల విడిసి ఏడికి పోతవక్కా, ఈ లోకం అడిదాన్ని ఒంటిగ బతుకనిస్తద." రామక్క.

"లోకం కాలికూలి కాముని పెంటకానియ్యి." తను వెనకకు మర్రి చూడకుండా ఎవరో తరిముతున్నట్లు పరుగెత్తింది. లోపల అడివిలో ఎలుగడి బడినట్టు మంట అంతా కూలగొట్టాలని, ధ్వంసం చెయ్యాలని - తిండిపరిగ తినక శరీరం ఒక్క పేలింది, గిడుపలారింది. నరాలు పుటపుట తెగిపోతున్న చప్పుడు.....

అట్లా ఎవరు చొరజాలని భయంకర కీకరణ్యంలో దారితప్పిన బాటసారిలా తను సాగిపోయింది. అప్పుడు తనను ఎవరైనా స్నేహంతో దగ్గరికి తీసి "నువ్వు చిగురుటాకులాంటి మనిషివి తల్లీ! కోమలమైన నీ చేతులతో మనుషులను ముట్టుకునేందుకే - నువ్వ మనుషుల అడుగుల్లో అడుగు కలుపాలన్నందుకే - మిలమిల మెరిసే వెలుగుతో కనబడినందుకే - ఇన్నింత యాతన పెట్టారమ్మా - ఈ దునియకు అలవాటైన మోటుపద్ధతి అదేనమ్మా - నువ్వు దునియను ఒక్కదిక్కే చూశావమ్మా మరోపక్క ఉంది ....నీలాంటి మనుషులుని కాళ్ళయిగ మనుషులు ఉన్నారమ్మా" అనల్గితే - తను అలాంటి మనుషుల కోసమే వెతుక్కుంటూ వచ్చిందా?

పొయ్యిమీది అన్నం పొంగింది ... రాజేశ్వరి కళ్లు తుడుచుకొని - అన్నం వార్చింది. కూర వండాలన్పించలేదు, పొయ్యి చల్లార్చింది.

తను తనకు అక్క వరుసైన వెంకటక్క ఊళ్లోమూడు నెలలు గడిపింది. కుట్టుపని నేర్చుకున్నది. కూలిపని చేసింది. అయినా లోపలి మంట చల్లారలేదు. తనకేమి కావాలో తెలియలేదు. తనను వెతుక్కుంటూ ఎవరైనా వస్తారని ఎదురు చూసింది. తనకెవరు లేరా? తను ఎటుపోయినా పట్టించుకునే వారులేరా? శంకరి ..... అ కుటుంబ బంధనాలు చేధించుకొని రాడా? రాడని తెలిసి మరింత తల్లడిల్లిపోయింది .... మూగమొద్దులాగా అయిపోయిన తననుచూసి ఎవరో కొండగట్టు అంజనేయుని దగ్గరి ఉండల్తే బాగయితదని చెప్పిండ్లు.

తను అ ఊళ్లో ఉండలేకపోయింది ... సుడిగాలిలో కొట్టుకపోయిన అకులాగా కొండగట్టు మీదికి చేరుకున్నది.

రాజేశ్వరికి పరమ భీకరమైన కొండగట్టు మనసులో మెదిలింది. చుట్టూ విస్తరించిన అడవులు - కొండకింద పల్లెటూళ్లు ... కొండమీద అంజనేయుని గుడి, కొండరాళ్లమధ్య నీటికోలను - వేపచెట్టు - ప్రభుత్వం కట్టిన సత్రాలు - శుక్ర శనివారాలు జనసందోహం - అరోగ్యం బాగాలేనివాళ్లు, పిచ్చోళ్లు, పిల్లలు లేనివాళ్లు, బహుశా తనతోటి మనువు చెదిరినవాళ్లం అంతా తిక్క తిక్కగా అదో లోకంలాగుండేది - చన్నీళ్ల స్నానాలు, తూలడాలు - గుట్టకింద మేకలు, గొర్లు , కోళ్లుకోసుకున్న అట్టలు కట్టిన నెత్తురు మరకలు - కోడి బూరు -

రాత్రనకా పగలనకా అరిచే పిచ్చివాళ్లు - బండలకు తడి బట్టలతో తలలు విరబోసుకొని 'అరం' బట్టే అడవాళ్లు - గొంతు నరాలు ఉబ్బుతుండగా పిచ్చి వాళ్లలాగా భజనలు .

తను ఆ మనుషుల్లో కలువలేకపోయింది. చుట్టూ పరుచుకున్న అడవిలో ఎత్తైన చెట్లకింద - దిగులుగా చీకటి నిండిన - ఆ చలికాలపు రాత్రుల్లో చిగురుటాకులా అల్లల్లాడిపోతూ దయ్యంలా తిరిగింది. అక్కడి ప్రతి చెట్టు, పుట్టా, రాయి రప్ప నడిగింది, వెతికింది. ఆకలితో ముడుచుకొని పడుకునేది - వెక్కివెక్కి ఏడిచేది. అక్కడ చేరిన సాధుసంతులు రాత్రిల్లు బీడీలు కాలుస్తూ తత్వాలు పాడేవాళ్లు - తనకు బీడీలు యిచ్చేవాళ్లు - తను బీడీలు తాగడం నేర్చుకున్నది.

"నువ్వింకా కోమలి పిల్లవు. మేమంటే ఏ జన్మలో పాపం చేసుకున్నామో అనుభవిస్తున్నాం. ఈ దిక్కుమల్లె గతి నీకెందుకు బిడ్డా! మీ వాళ్లెవరన్నా ఉంటే ఇక్కన్నుంచిపో బిడ్డా!" అనేవాళ్లు.

తను పులుకు పులుకున వాళ్ల ముఖాలు చేసేది.

అట్లా నలుబైరోజులు ఆ గుట్టమీద - సత్రంలో పెట్టిన తిండితిని బతికింది.

అక్కడ నిలువలేకున్నది - మరెక్కడికి పోవాలో తెలియదు. శుక్రవారం కోనేట్లో చన్నీళ్లతో చాలాసేపు స్నానం చేసింది. నరాలు చిట్లిపోతున్నట్లుగా - ఎవరి గొంతన్నా పిసుకాలన్నంత కసి తనకే మయ్యిందో తెలియదు. తను కొండమీది నుండి కిందికి దూకాలనుకున్నదా? తనకే మయ్యిందో తెలియదు. ఉరికి ఉరికి వెళ్తిని బండరాయికి గుద్దుకున్నది. తల పగిలిందనుకున్నది. స్పృహతప్పి పడిపోయిందా?

మెలుకువ వచ్చేసరికి చెట్టుకింద పరిచిన తువ్వాల మీద పడుకోబెట్టి ఉన్నది. సాధుసంతులు వేపాకులతో విసురుతున్నారు. ఏదో అంటున్నారు .... ఎవరో వచ్చి కట్టు కట్టారు తలకు ... తను కళ్లు మూసుకున్నది. చెట్టుకిందినుండి సత్రంలోకి మార్చారు. ఒకరోజా రెండు రోజులా ... తను జ్వరపడ్డదా? గాయపడ్డదా?

ఎవరో చెప్పారు? తనకోసం వెతుక్కుంటూ ఎవరో వచ్చారని - తను గుడగుడలాడే గుండెతో లేచికూర్చున్నది. పెదమామయ్యా! అవ్వా! వాయినా! శంకరా?

వాళ్లెవరు రాలేదు. పెద్దత్త తమ్ముడు లింగయ్య, లచ్చుమక్క వచ్చారు. తను ఎప్పుడో చూసిన గుర్తు.

లచ్చుమక్క వస్తూనే ఒళ్లంతా పునికింది. మనిషి స్పర్శ తను అమెమీదపడి ఏడ్చింది .... లింగయ్య ఒకటనలే రెండనలే . వాళ్లు రమ్మన్నారో ? తనే వాని వెంట బడి పోయిందో ? తను పెనుమంటలాగా బీడీలు చిరిగిన బట్టలతో ఆ వూరికి వచ్చింది.

తను తేరుకునేదాక లచ్చుమక్క సేవలుచేసింది.

"రాయేశ్వరీ ! మీమామ దినాలకు బోతే తెల్పింది ఎంకటక్క చెప్పింది కొండగట్టుకు పోయినవని - నేను బీదోన్నే కాని - నామనుసు సమ్మర్లు నుట్టుక పోయింది బిడ్డా! ఎతుక్కుంటచ్చిన.' ' లింగయ్య చెప్పిండు.

ఇక్కడి ఊరు మొదట్లో తనకు చిత్రంగా కన్పించేది. తను చెడును మాత్రమే అనుభవించింది. కాని ఇక్కడి మనుషులు తను ఊరి వాళ్ల తీరలేదు. ఆ మనుషుల్లో కలిసి పోవడానికి, మనుషుల అర్థం చేసుకోవడానికి చాలా దినాలే పట్టింది.

లోపట గడ్డకట్టిన దేదో కరుగవారంభించింది....ఆడవాళ్లు రాత్రిపూట చదువుకుంటుంటే తను చదువుకున్నది. వాళ్లు పాడితే మిలమిలలాడే కళ్లతో వాళ్లను చూసేది - ఎంత ధీమాగా పాడుతున్నారు. దోపిడి, కష్టజీవులు, సంఘం, అన్నలు లాంటి అనేక మాటలు తను విన్నది.

లింగయ్య ఇంటికి ఎవరెవరో వచ్చేవాళ్లు - వాళ్ల మాటలు వినగా వినగా తన మాటల్లాగే తోచేవి - వాళ్ల కళ్లల్లో కన్పించే నిర్మలమైన కాంతి తనకు లోలోపల అతలా కుతలం చేసేది....

తన భాగోగులు ఊరివాళ్లందరు చూశారు. తను మాట్లాడకున్నా పాడకున్నా యిష్టంగా కొన్ని పనులు చేసేది. పొరుగూళ్లో స్కూళ్లో చేరిపొమ్మన్నారు. తను తికమక పడ్డది.

ఈ ఇల్లు కట్టడానికి తలో చెయ్యి వేశారు.

ఇప్పుడు తను వాళ్లందరి నోట్లో నాలుక .....

రాజేశ్వరి పొడుగ్గా గాలి పీల్చి వాకిట్లోకి వచ్చింది. సాయంత్రం చిరుగాలి ఆమెకు కొంచెం చలిగాను - కొంచెం హాయిగాను అన్పించింది.

" ఏమాయెనక్కా ఇంకా తయారు కాలేదు." నర్సమ్మ కళకళలాడుతూ వచ్చింది.

"అయిపాయె" రాజేశ్వరి. ఆమె గొంతు ముద్దగాను, ఆర్ద్రంగానూ, ప్రేమగానూ మోగింది.

చేతులు వెనకకు పెట్టుకున్న నర్సమ్మ నవ్వుతూ అద్దం దువ్వెన తీసింది.

ఏమి ఎరుగనట్టు రాజేశ్వరి మొఖం కడుక్కొచ్చుకున్నది.

"అక్కా .... నీతల దువ్వుత." అన్నది నర్సవ్వ.

"వద్దు - వద్దు.' అంటూనే రాజేశ్వరి నర్సమ్మ ముందుకూచున్నది.

నర్సమ్మ దువ్వ సాగింది "నీ దెంద పెద్ద జుటక్కా".

జడవేసింది.

రాజేశ్వరి అతలాకుతలంఔతూ - జడవిప్పి సిగచుట్టుకున్నది., నర్సమ్మ వెళ్లిపోయిన తరువాత అద్దంలో ముఖంచూసుకున్నది ....

నరాలు ఒక్కసారిగా మీటినట్టుగా -

అప్పటికే అయిదారుగురు లచ్చుమక్క వాకిట్లో నిలబడి పిలుస్తున్నారు ....

రాజేశ్వరి ఇంటికి తాళం పెట్టి వీధిలోకి వచ్చింది.

వీధిలో తను ఊరి వాళ్లే కాక పక్కూళ్ల వాళ్లు కూడా వచ్చి చేరుతున్నారు.

"బిడ్డా! శంకరయ్య చనిపోయి వారమయ్యిందట మీ నడిపి మామ కలిసి చెప్పిండు". లింగయ్య చెప్పిన మాట -

తను ఏడ్చిందా? ఏడుపు సాంతం ఇంకిపోయినట్లుగా నిలుచున్నదా? నర్సమ్మ తన చెయ్యి పట్టుకున్నది - వీధిలో నడుస్తున్నారు.

వీళ్లంతా తననేమనుకుంటారు? దిక్కుమాలిన ఒంటిరి కొట్లాటల తనెంత అలిసిపోయింది. చావలేక బతికింది, బతికి చచ్చింది. తననెవరు పట్టించుకోకున్నా ఏ ఆధారంతో తను నిలదగలిగింది? ఈ ఊరికి వచ్చిన తరువాత మొదట తనకోసం - తర్వాత అందర్ల కలిసి, కూలిరేట్ల పోరాటంల ముందు నిలబడింది.సారా పోరాటంలతోటి ఆడవాళ్లతో కలిసి ఊరూరు తిరిగింది. పోలీసులు కేసులు, అన్నింటిలో అందరితో పాటు తను కలెగల్సిపోయింది.... అవూరు వాళ్లు సంఘాలను పెట్టారని గిట్టుబాటు ధరలగురించి లొల్లి చేశారని , భూములు దున్నారని - 'అన్నలకు' అన్నం బెట్టారని ఊరుమీద అనేకమార్లు దాడులు చేశారు. కేసులు బెట్టారు.

గెలిచిన ఎమ్మెల్లేను అవ్వన్ని అడుగాలని కేసులు ఎత్తి వేయించాలని - పక్కుల్లో పెట్టిన పోలీసుక్యాంపు ఎత్తి వేయించాలని అందరు అడుగాలని ఆలోచనలు చేస్తున్నారు. వాదోపవాదాలు చర్చలు చేస్తున్నారు.

వూరి సర్పంచ్! నర్సింగరావు ఎన్నదో ఊరిడిసి జిల్లా కేంద్రంలో మకాం పెట్టాడు. తన పార్టీ గెలిచిందని పదిహేను రోజుల క్రితమే మేరువానం మాటలు చెప్పి ఊళ్లో కొచ్చాడు. అధికార పార్టీ కనుక ముందు ముందు పనులుంటాయని సన్మాన సభకు నాయకత్వం వహిస్తున్నాడు.

"అబ్బో సర్పంచి కర్ర విరక్కుంట పాము సావకుంట జేత్తడు' ' లచ్చుమక్క.

పెద్ద బజారు మొదట్లో ఉన్న శంకరమ్మ ఛాయ్‌హోటల్ దగ్గర మీటింగుకు పోయే జనం జమయ్యారు.

"కట్టె మన చేతులున్నంక పామేడికి పోతదిలేవే" పోశాలు తాత.

"సర్పంచ్ కొత్త పెండ్లి కొడుకు తీర్గ ఉరుకులాడుతండు" అన్నారెవరో?

"ఇన్నేండ్లురాని ఊరుగిప్పుడు మతికచ్చిందేమే?

"మల్ల ఓట్లత్తయికావచ్చు".

"కాదు కాదు ఎమ్మెల్లే సాబుకు మస్కగొడితే".

"ఎమ్మెల్లెకు అమ్మ కాళ్లకు అయ్య కాళ్లకు మొక్కటానికే సరిపోతుంది".

పసుపు పచ్చ బట్టలేకుకొని బ్యాడ్జీలు పెట్టుకొని కార్యకర్తలు అటిటు తిరుగుతున్నారు..

మైకులో ఏమి పాటలు వెయ్యాలో తేలక మైకు కాసేపు ఆపి మళ్లీ వేశారు ....

మీటింగు ఏర్పాట్లు చూసి తిండి ఏర్పాట్ల గురించి ఇంటికొచ్చాడు సర్పంచ్ - అప్పటికే ఆ పనుల్లో మునిగిపోయిన మాజీ పోలీస్ పటేల్ అంతా రడీ అంటూ బంతుల్లోకి వచ్చాడు. కారోబారు వచ్చాడు.

ఎప్పటి నుంచో సర్పంచ్ కోసం ఎదురు చూస్తున్న ఇద్దరు ముసలి దంపతులు చింత చెట్టుకింద నుండి బంకుల దగ్గరికి వచ్చారు.

"దొరా! నా కొడుకును జేల్లేసి రెండ్లేడాయె - తిరిగి తిరిగి మా పానం బోతంది... మాకు ఆ కచ్చీర్లు తెలువకపాయె..." ముసలాయన గుర గురలాగే గొంతుతో.

"ఒక్కడే కొడుకు - జెర పెద్దలోకులు ఎమ్మెల్లే సాబ్‌తోటి చెప్పి ఇడిపియ్యండ్లి - సచ్చినీ కడుపున బుడుతం" ముసలామె రెండు చేతులు జోడించి మొక్కుతూ.

"నేనేం చేయగలుతనే అవ్వ! అవ్వేమన్న ఉట్టుట్టి కేసులా ఇడిపియ్యటానికి - భూములు జెండాలుపాలిరి, సర్కారులో పటేసే దానికి కాన్‌కిస్కేగాన్ని నేనేం జేత్త మా చేతులేమున్నది." వినయం తెచ్చిపెట్టుకొని సర్పంచ్ నర్సింగరావు.

"అప్పుడు మిమ్మల్ని ఆగవట్ట వశమైనదా? ఓ పంచాదులు అమే - పడావులు మాయే - మా రాజ్జెం వచ్చి పట్టట్టే ఎగిరెగిరి పత్తిరి. సర్కారు నిషదం బెట్టే అందరం అనుభవించవడిమి."

మాజీ పోలీసు పటేల్.

"పెద్దవ్వా నీకొడుకు పోతీనుపటేల్ కొడుకును చెంద్రమ్మన ఏమె అంటే ముక్కు భూమికి రాకిచ్చిండని కోపంలేయే." అటుకేసి వస్తున్న మాలొల్ల పెద్దవ్వ అన్నది.

అదేమి పట్టింకోకుండా "ఏం నిషేధం తియ్యండ్లి. భూములు దున్నని నిషేధం బెడితే జనం ఇంకో దిక్కు రూటు మార్చిండ్లు. సారా తాగద్దని లొల్లి జేసిండ్లు. సర్కారు పోలీసులతోని సారా మామూలు సారా తాగద్దని లొల్లి జేసిండ్లు. సర్కారు పోలీసులతోని సారా మామూల నడిపించ్చిండ్లు. ఎత్తుకు పై ఎత్తు ఆడోల్లంత కలిసి వెలుత్తంగానే సార బంధు వెట్టిచ్చిరి. ఒక ఎవలు గెలిచినట్టు ఎవరు ఓడినట్టు."

కార్‌బార్ ముఖం వెలిగిపోతుండగా.

నర్పంచ్‌కు అది నిజమే నన్పించింది. కాని అదిఆరోబారు నోట వినడం బాగనిపించలేదు. "సరేలేవయ్య ఇంతెజాములు చూడండ్లి - ఆరయ్యింది. ఇంకాగంటే ఉన్నది." అన్నాడు.

"అయ్యా తమకు జెర చెప్పాలె" మునలయ్య. బతిమిలాడసాగిండు.

అటుకేసి వచ్చిన లింగయ్య "పెదనాయిన గాయినేంది అడిగేటి - మన ఊళ్లో సంగతులు, నీ కొడుకు సంగతి సుభకాయిదుల రాసినమ్. మనందరం అడుగుదాం రాయె... గట్లయితేనే ఎమ్మెల్లే లేకపోతే". వాళ్లిద్దరిని తీసుకొని నడిచాడు.

"సచ్చి నీ కడుపున పుడుతరా లింగయ్య." ఆ ముసలయ్య.

సర్పంచ్‌కు అవమానమన్పించింది. కాని అంతకన్నా చేసేదేమి లేదు .... ప్రహరి గోడకు అతికించబడిన పోస్టరు జ్ఞాపకం వచ్చింది.

"జనం తమ సమస్యలతో మీ దగ్గరికి వస్తారు. మీరు ప్రజల ఓట్లతో గెలిచారు కనుక. ఊళ్లల్లోని క్యాంపులు ఎత్తి వేయించాలి. అక్రమంగా పెట్టిన కేసులు రద్దు చేయించాలి. మిగులు భూములను పేదలకు పంచాలి." ఇంకా ఆలోచించలేకపోయాడు.

"గవర్నమెంటు సారా గంగలకల్సిపోయిందిగని - మనూళ్లె గడుంబ పెట్టకుంట సూడాలె." రాజేశ్వరి పక్క నడుస్తున్న కనకమ్మ అన్నది.

రాజేశ్వరి కనకమ్మ చేతిలోని పిల్లను తీసుకుంది. "దానికి ఎమ్మెల్లే ఏంజేత్తడు. మనమే చూసుకోవాలె." లలిత అన్నది.

"అంటే నీకు పెండ్లి పెటాకులు కాలేదు.... లూగుడుసపంగతే మెరుక అంటున్నది సూడక్కా" లలిత రాజేశ్వరికి పిర్యాదు చేసింది.

"అదేంకాదు లలిత నువ్వన్నదే నిజం" రాజేశ్వరి.

ఇంతలోనే నల్లగా పొట్టిగా ఉన్న సారాదుకాణపాయినే పెద్ద బొత్త ఊగుతుండగా మీటింగు కాడికి వస్తున్నాడు. అతని వెనుకే అతని భార్య.

"దుకాణం కాల్చేసిరి. మనకేదన్న దారి సూపెట్టుమని చెప్పవయ్య ఎమ్మెల్లేకు" అతని భార్య గొనుగుతోంది.

"కరువుకలముందె - కాలానికి ముందే" లచ్చుముక్క

"సారా దుకాణం కాలబెట్టినరోజు పోలీసుల పట్టుకొచ్చి ఊరిమీద దోలిండుగా' ఎవరో -

శంకరమ్మ టేల దగ్గర జనం పోగౌతున్నారు.

"ఆళ్ల బాధ ఆళ్లది". ఒక ముసలమ్మ గొనిగింది.

"కాదు మరి. మంది కడుపులు గొట్టు కుంట అన్నాయెపు సంపాదనతోటి ఎన్ని దినాలు బతుకుతరు. కట్టంజేసుకబతుకాలె. కాల్రెక్కలు ఆడించి బతుకాలే". కనకమ్మ కోపంగా.

రాజేశ్వరి అన్నీ వింటోంది. జ్ఞాపకాల చిత్తడి జల్లులో తడిసి ముద్దయిన రాజేశ్వరి - ఆ మనుషుల రకరకాల మాటలను వింటోంది. మొత్తానికి వాళ్ల తమ కడుపులున్నది దాచుకోకుండా చెప్పుకోగలుగుతున్నారు ....

తను ఇంతవరకు ఒక్క మాట చెప్పుకోలేదు. తనకు అరువాలని ఉంది. పాడాలని ఉంది. అందరి ముందు నిలబడి చాలా చెప్పాలని ఉంది.

ఎందుకో రాజేశ్వరికి అంతమంది స్పర్శ తెలుస్తోంది. లోపలెక్కడో కదులుతోంది.

ప్రాణాలు తీసే మనుషులున్నారు - కాని మనుషుల కోసం ప్రాణాలిచ్చేవాళ్లు జ్ఞాపకం వచ్చారు.

ఇప్పుడు ఇక్కడి ఊళ్ల గుడ్డి దీపాల వెలుగులో ముడుచుకొని లేవు. మనుషులు నీ బొంబ్బెన్లు అమాయకంగా పులుకు పులుకున చూస్తలేరు.

కనకమ్మ కూతురు రాజేశ్వరి చంకలో ఆగలేకపోతోంది. జిగేలుమని లైట్లు వెలుగాయి.

రాజేశ్వరి పుచ్చపువ్వులాంటి వెలుగులో నవ్వే ఆ పసిపాప బుగ్గమీద ముద్దు పెట్టుకున్నది.

మైకులో సభ మొదలౌతుందని చెప్పుతున్నారు.

పెద్దరోడ్డు మీద కారులో ఎమ్మెల్యే వస్తున్నట్లు జనం హడావిడి పడుతున్నారు.

జిలుగు వెలుగల సభకేసి అందరు ఆడవాళ్లతో సహా రాజేశ్వరి బయలుదేరింది.

రక్తసిక్త చరిత్రలో రాజేశ్వరి బతుకు మరెన్ని మలుపులు తిరుగనున్నదో?

